క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలసిన కసాపురం ఈఓ



ఎమ్మెల్యే వైవీఆర్‌కు అమ్మవారి ఫొటో, తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ భద్రాజీ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆలయ ఈఓగా నియామకమైన భద్రాజీ శుక్రవారం సిబ్బందితో కలసి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని కలిశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న ఆయన కసాపురానికి బదిలీ కావడంతో ఎమ్మెల్యేను కలిసి మావుళ్లమ్మ అమ్మవారి ఫొటోతోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఆయనకు ఎమ్మెల్యే సూచించారు.

నెట్టికంటుడి సేవలో 'ట్రిబ్యునల్ చైర్మన్'



స్వామి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్ శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు స్వామి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలను ఆయనకు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న మంజునాథ్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు సోదరుడు సుంకన్న అనారోగ్య కారణాల వల్ల శుక్రవారం ఉదయం మృతిచెందాడు. సర్పంచ్ రమేష్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మంజునాథ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

'సిద్ధం' జయప్రదం చేయండి



సభ విజయవంతంపై సమీక్షిస్తున్న నాయకులు

పామిడి: రాప్తాడులో ఆదివారం నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగసభకు మండలవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తరలిరావాలని పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ, రూరల్ గ్రామాలకు సంబంధించి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ సీబీఎస్ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కె.నారాయణరెడ్డి మాట్లాడారు. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎస్ఆర్ఐ ఎం. కుమార్‌రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, బోయ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



వెన్నపూసపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు శివసాయి

యాడికి/యల్లనూరు: యాడికి మండలంలోని వేములపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వేములపాడు, తిమ్మాపురం, కొట్టాలపల్లె, కొత్త పెండేకల్ గ్రామాల నుంచి వచ్చిన 215 మందికి రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య, అనంతపురం వైద్య నిపుణులు శ్రీనివాసులు రెడ్డి, మీనాక్షి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీఓ సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివుడు, ప్రసాద్ రెడ్డి, అమర్‌నాథరెడ్డి, రసూల్, పురుషోత్తం రెడ్డి తదతరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండలంలోని వెన్నపూసపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, సర్పంచు నాగకుమారి, వైద్యులు లోకేష్, మంజుల, శివసాయి, పంచాయతీ కార్యదర్శి మాబు, సీహెచ్‌ఓ మధుకుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడువాహనంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామిని ఆలయ ముఖమండప ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో రథసప్తమి పూజలను నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి యంత్రాన్ని ఏర్పాటు చేసి ఆరాధనలు చేపట్టారు. అక్కడే చక్కెర పొంగలిని సిద్ధం చేసి స్వామికి నివేదించారు. ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది కలసి సామూహిక సూర్యనమస్కారములు నిర్వహించారు. అనంతరం గురుడ వాహనంపై కొలువుదీరిన స్వామిని ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్యం సంఘం, వాసవీ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు సూర్య కిరణాల వెలుగులో చక్కెర పొంగలి నివేదించారు. అనంతరం సూర్యనారాయణ స్వామి ఆర్ఘ్యం సమర్పించి సూర్య నమస్కారాలు చేశారు.

పెద్దపప్పూరు: రథసప్తమి సందర్భంగా మండలంలోని అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో శుక్రవారం చక్రభీమలింగేశ్వరుడికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ప్రధాన అర్చకులు సుధీర్ కుమార్ శర్మ, బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్‌శర్మ తదితరులు ఆలయ విశిష్టతను వివరించారు.అనంతపురం భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రమణ్యంలు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాయకుల స్వామి ఆలయలో శుక్రవారం రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయాల్లోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం గావవించారు. గరుడసేవలో భాగంగా దేవతా మూర్తులను ఊరేగించారు.



కసాపురంలో సూర్యయంత్ర ఆరాధన పూజలను నిర్వహిస్తున్న పండితులు



స్వామి ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



గుత్తిలో వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



పెద్దపప్పూరు: అలంకరణలో చక్రభీమలింగేశ్వరుడు



తాడిపత్రి: శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకులస్వామి



పామిడి: గరుడ వాహనసేవలో దేవతామూర్తులు

వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టండి



ప్రచారం చేస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 17వ వార్డులో పర్యటించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థకు శ్రీకార ం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. తాడిపత్రిలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి బి.రాజేష్, నాయకులు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు పావని, సంజన

శింగనమల: మండలంలోని ఈస్ట్ నరసాపురం ఎంజేపీ పాఠశాలలో 9వ తరగతి చదువుచున్న కె.పావని, కె.సంజన ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీతకుమారి తెలిపారు. ఎంపికై న విద్యార్థినులను శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.

ఘనంగా మహంకాళి విగ్రహ ప్రతిష్ట



బీకేఎస్ మండలంలోని జంతలూరులో పూజలు నిర్వహిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు



కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలకు సాంబశివారెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈఓ రమేష్‌బాబు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు గ్రామంలో మహకాళి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన సమన్వయకర్త వీరాంజనేయులును ఆదరించాలన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలూరు రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలకు రండి

శింగనమల: బుక్కరాయసముద్రంలో వెలసిన కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయని, ఉత్సవాలకు రావాలని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ బాబు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు రమణారెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో అర్చకులు చాగంటి లక్ష్మణాచారులు, వైద్యం శ్రీనాథ్ పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- 11 కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి భూ పంపిణీ

మాది చేతల ప్రభుత్వం



కులాల ప్రతినిధులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



హాజరైన ఆయా కులసంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: 'మాది మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వం. ఒక్కసారి మాటిస్తే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడే నైజం వైఎస్సార్‌సీపీ సొంతం' అని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని 11 కులాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించారు. కసాపురం రోడ్ ఏబీ ఫంక్షన్‌హాల్ సమీపంలో సర్వే నెంబర్.398–2లో వరుసగా 11 కులాలకు (వీరశైవ లింగాయత్, కుమ్మర, ఉప్పర, అరెకటిక, రజక, పద్మశాలి, కావలి, బెస్త, విశ్వబ్రాహ్మణ, జంగమ లింగాయత్, నాయీబ్రాహ్మణ).. ఒక్కో కులానికి 18 సెంట్ల చొప్పున కేటాయించిన స్థలానికి సంబంధించిన పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ఆయా కులసంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్. రామలింగప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరి సహకారంతో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే బ్రాహ్మణ, రెడ్డి, బలిజ, బేడబుడగ జంగాలు, ఏకలవ్య, సంచారజాతులు, ఎస్సీ, క్రిస్టియన్స్, బంజారాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి కూడా స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించామని, త్వరలోనే వారికి కూడా స్థలాలు మంజూరు చేయిస్తామన్నారు. గత పాలకులు, విపక్షాలు ప్రజలకు మంచి చేయకపోయినా.. అభివృద్ధిని అడ్డుకోవడం తగదని ఆయన హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం ఆయా కులసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఒకే చోట 11 కులాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం చరిత్రాత్మకమని, జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్, మాజీ చైర్మన్ రామలింగప్పలను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు మెహరున్నీసా, సుధాకర్, సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రీ, ఎద్దుల శంకర్, మాచర్ల శివ, రంగన్న, వివిధ కులసంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యండి

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా శుక్రవారం ఎమ్మెల్యే పట్టణంలోని ప్రధాన రహదారి సీబీ రోడ్డులో పర్యటించారు. ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకెళ్లారు. గత 35 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లవైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిందన్నారు. గత టీడీపీ హయాంలో పట్టణంలో అశాంతి నెలకొని ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ వ్యాప్తంగా శాంతిభద్రతలకు పెద్దపీట వేశామన్నారు. మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు రియాజ్, ఆకుల నాగిరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మనోజ్, నాయకులు అంబటి రాఘవ రెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, హనుమంతరెడ్డి, హరినాథ్‌రెడ్డి, జబ్బార్, సునీల్, అయూబ్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.



పండ్లు అమ్ముకునే మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

బాలోత్సవంలో రేగడి కొత్తూరు విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం: మండలంలోని రేగడి కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు బాలోత్సవంలో ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు సీతారామిరెడ్డి తెలిపారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో అనంత బాలోత్సవం పోటీలు నిర్వహించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, షమీవుల్లా, బాజ్జీనాయక్, శ్రీలక్ష్మి, పద్మావతి, సూర్యుడు. మీనాకుమారి, చాంద్‌బాషా, గ్రామపెద్దలు నాగముణి, రామచంద్రారెడ్డి, నాగలింగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

22న వలంటీర్లకు పురస్కారాలు

యల్లనూరు: మండలంలోని ఉత్తమ వలంటీర్లకు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేతుల మీదుగా పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేస్తారన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫిల్టర్ బెడ్స్ శుభ్రం చేయించండి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ వాటర్ ఫిల్టర్ బెడ్స్‌తో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించి ప్రజలకు శుద్ధి నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య సూచించారు. శుక్రవారం ఆయన హంద్రీనీవా కెనాల్, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలతో పాటు ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, ఏఈ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేటలో శనివారం ఉదయం 9 గంటకు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



గుత్తి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న క్యాన్సర్ బాధితుడు రామాంజనేయులుకు శుక్రవారం మండలంలోని నాయి బ్రాహ్మణులు సేకరించిన రూ.50 వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. నాయీ బ్రాహ్మణులు కేబీ రామకృష్ణ , రామస్వామి, సురేష్ బాబు, నారాయణ స్వామి, రవి, నాగేంద్ర, ప్రసాద్, ఆనంద్, పురుషోత్తం, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడు, శనగలగూడూరు, వెంగన్నపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ దస్తగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వసతులపై ఆరా తీశారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

పెద్దవడుగూరు: ప్రతిఒక్కరూ ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శేషారామ్‌సింగ్, ఎంఈఓ రాముడు సూచించారు. శుక్రవారం మండలంలోని మేడిమాకులపల్లి, తెలికి, పెద్దవడుగూరు గ్రామాల్లో ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు, వీఆర్వోలు, సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

హ్యాకర్ల పట్టివేత

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో హ్యాకర్లను పట్టుకున్నట్లు డీసీఎం సోమశేఖర్‌నాయుడు తెలిపారు. కమర్షియల్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం గుంతకల్లు–రాయచూర్ సెక్షన్‌తోపాటు రైల్వే జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బయటి నుంచి ఆహారం తీసుకువచ్చి రైళ్లలో విక్రయిస్తున్న దాదాపు 10 మంది హ్యాకర్లను పట్టుకున్నారు. వారిని ఆర్‌పీఎఫ్‌లకు అప్పగించినట్లు డీసీఎం తెలిపారు. అదేవిధంగా రైళ్లలో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న దాదాపు 100 మందికి రూ.25వేలు ఫైన్ వేశామన్నారు.

ఘనంగా రైల్వే హైస్కూల్ వార్షికోత్సవం

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 42వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా డీఆర్ఎం వినీత్‌సింగ్, ఎస్‌సీఆర్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు అంజనిసింగ్, ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, ఎం .సుధాకర్, సీనియర్ డీఈఎన్ కోర్డినేషన్ అక్కిరెడ్డి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు మద్దతుగా ర్యాలీ

గుంతకల్లుటౌన్/గుత్తి/పుట్లూరు/పెద్దవడుగూరు: మోదీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలిచ్చిన గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా శుక్రవారం గుంతకల్లులో వామపక్ష పార్టీల నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే గుత్తి పట్టణ శివార్లలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో ఉన్న బీపీసీఎల్ డిపో ఎదుట శుక్రవారం డ్రైవర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. పుట్లూరు మండలంలోని కొండాపురం వద్ద , పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు వద్ద జాతీయ రహదారిపై వామపక్ష నాయకులు రాస్తారోకో నిర్వహించారు.

పరిశోధనలపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువులతో పాటు పరిశోధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ఇండియన్ టెలికాం సర్వీస్ ఆఫీసర్ ముజీబ్ షాషా సూచించారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీస్‌పై బీఎస్ఎన్ఎల్ అనంతపురం సహకారంతో వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ టెలికాం సర్వీస్ ఆఫీసర్ ముజీబ్ షాషా, జేటీఓ పక్రుద్దీన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ రవిచంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సైపుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు: ఈహెచ్‌టీ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో గుంతకల్లు పట్టణ, మండలంతోపాటు వజ్రకరూరు మండలంలో కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు.

గుత్తి: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఉంటుందని ఏఈ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గుత్తితో పాటు పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఘనంగా కృష్ణదేవరాయల జయంతి

గుంతకల్లు/యాడికి/శింగనమల: గుంతకల్లులో పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో కృష్ణదేవరాయల జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పూలరమణ, గోవిందరాజులు, నాయకులు మనీశ్వరప్ప, శ్రీనివాసులు, సంజీవరాయుడు, సత్య, పట్నం రామాంజినేయులు, పవన్‌ప్రింటర్ రవి, కృష్ణ, రంగ, అఖిల్, ఉమ, వనజ, భవానీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికి బస్టాండు సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద శుక్రవారం కృష్ణ దేవరాయల జయంతి వేడుకలు మండలంలోని బలిజలు ఘనంగా నిర్వహించారు.బలిజ సంఘం అధ్యక్షుడు హరి స్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలా రమేష్ బాబు, బలిజలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రాయలచెరువు బస్టాండు వద్ద నిర్వహించిన వేడుకల్లో నామాల రమణ, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. శింగనమలలోని రామాలయంలో ఆయన చిత్ర పటానికి కాపు నేతలు క్షీరాభిషేకం చేశారు. కాపు నేతలు నాగర్జున, విక్రమ్, వెంకటనారాయణ, శంకర్‌నారాయణ, ఎల్ వి రమణ, మురళీకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.